

పయ్యావులకు అపూర్వ స్వాగతం

- సరిహద్దులో ఆహ్వానించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు
- కరిడికొండ నుంచి ఉరవకొండ వరకూ జనమే జనం
- అడుగడుగునా పూల వర్షం.. బాణసంచా పేలుళ్లు
- బాట సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన కేశవ్

అనంతపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, శాసన సభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజలు సోమవారం అపూర్వ స్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన తొలిసారి జిల్లాకు వచ్చారు. జిల్లా సరిహద్దు ప్రాంతం కరిడికొండ వద్దకు ఆయన ఉదయం 11.15 గంటలకు చేరుకున్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులు ఆయనను గజమాలతో సత్కరించి ఆహ్వానించారు. పార్టీ శ్రేణులు బాణ సంచా పేల్చి కేరింతలు కొట్టారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పయ్యావులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. పయ్యావులను జేసీ ప్రభాకర్‌రెడ్డి అలింగనం చేసుకుని అభినందించారు. అక్కడి నుంచి మంత్రి వాహనాన్ని జేసీ అస్మిత్‌రెడ్డి నడుపుతూ బాట సుంకులమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసి సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడి నుంచి గుత్తి పట్టణంలోకి ర్యాలీగా చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే జయరాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. గుత్తి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూల మాల వేసి నివాళులు అర్పించారు. స్వాగత ర్యాలీ జాయతీ రహదారి మీదుగా పామిడికి చేరుకోగానే స్థానిక నాయకులు స్వాగతం పలికారు. కల్లూరులో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితరులు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గార్లదిన్నె మీదుగా అనంతపురం నగర శివారులోని తపోవనం వద్దకు ర్యాలీ చేరుకుంది. అక్కడ అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో మంత్రి కేశవ్‌కు స్వాగతం పలికారు. ఎక్కడ చూసినా జై పయ్యావుల అంటూ పార్టీ శ్రేణులు నినదించాయి. మంత్రికి స్వాగతం పలికిన నాయకులలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, మాజీ మేయర్ స్వరూప, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి తదితరులు ఉన్నారు.


గుత్తిలో పయ్యావులపై పూలవర్షం

కూలీలాగా పనిచేస్తా
- మంత్రి పయ్యావుల



రాష్ట్రానికి తాను మంత్రిని అయినా.. కరువు జిల్లా అనంత అభివృద్ధికి కూలీలాగా పనిచేస్తానని కేశవ్ అన్నారు. కరువు జిల్లాలో తాగు, సాగు నీటి కోసం జరిగిన పోరాటాల మధ్య తాను పెరిగిన విషయాన్ని మరిచిపోనని అన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు తన పట్ల చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు, ఆత్మహత్యలు చూస్తూ పెరిగానని, జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలను గెలిపించారని, దీంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. తమ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జిల్లా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి రెట్టింపుగా పనిచేస్తానని అన్నారు. కరువు నుంచి విముక్తి కలిగించేందుకు కృషి చేస్తానని అన్నారు.


బాట సుంకులమ్మ ఆలయంలో మంత్రి కేశవ్‌తో ఎంపీ, ఎమ్మెల్యేలు


కల్లూరులో పయ్యావుల కేశవ్‌కు గజమాలతో స్వాగతం


ఉరవకొండలో ర్యాలీకి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు


హౌసింగ్ బోర్డు డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈద్గా మైదానాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు దైవిక ప్రసంగాలు చేశారు. ఖురాన్ సందేశాన్ని వినిపించారు. ప్రార్థనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

- అనంతపురం కల్చరల్



నాన్నకు ప్రేమతో..

అనంతపురం హౌసింగ్ బోర్డులోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. అక్కడ ఓ చిన్నారి ప్రార్థన చేస్తున్న తన తండ్రి ముఖంపై చెమటలను చూసి తన వద్ద ఉన్న రుమాలుతో తుడిచి ప్రేమను చాటుకుంది.

- అనంతపురం కల్చరల్



మోసాల ప్రభుత్వం పోయింది

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుట్రలు, కుతంత్రాలతో సాగిన ఐదేళ్ల మోసాల ప్రభుత్వం పోయి మాట నిలబెట్టుకునే చంద్రన్న వచ్చారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం ఆమె విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే ఐదు కీలక హామీలు నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేశారని అన్నారు. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచేహామీలను నెరవేర్చడం ప్రారంభించారని అన్నారు. నిరుద్యోగుల ఆశలను నెరవేరుస్తూ ఏకంగా 16,347 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేలా మెగా డీఎస్సీపై సంతకం చేశారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని అన్నారు. ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి ఒక్క పోస్టు, ఒక్క క్యాలెండర్ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. ప్రజల భూములకు రక్షణ లేకుండా జగన్‌రెడ్డి తీసుకొచ్చిన నల్ల భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు రెండో సంతకం చేశారని అన్నారు. అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచారని అన్నారు. 2019లో చంద్రబాబు పింఛన్ రూ.2 వేలు చేశారని, ఇప్పుడు 66 లక్షల మందికి రూ.4 వేలు చొప్పున ఏప్రిల్ నుంచే ఇస్తారని అన్నారు. నిరుద్యోగుల నైపుణ్య గణన కోసం నాలుగో సంతకం, పేదలకు రూ.5కు నాణ్యమైన భోజనం అందించేందుకు అన్న క్యాంటిన్లను పునః ప్రారంభిస్తూ ఐదో సంతకం చేశారని అన్నారు. అన్న క్యాంటీన్‌లను జగన్‌రెడ్డి కక్షపూరితంగా మూసివేయించారని, కానీ పేదల ఆకలిని గుర్తించిన చంద్రబాబు వాటిని తెరిపిస్తున్నారని అన్నారు. వైసీపీ విధ్వంసాల పాలన ముగిసిందని, ఇక నుంచి ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగుతుందని అన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఎప్పటిలాగే.. ఆలస్యంగా..!

- నేడు జిల్లాకు కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ బృందం
- రబీ పంట నష్టం వివరాలు తెలుసుకునేందుకు..
- 19న రొద్దం, 20న జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన


యాడికి మండలంలో ఎండిపోయిన పప్పుశనగ (ఫైల్)

అనంతపురం అర్బన్, జూన్ 17: పంట నష్టం జరిగి.. సీజన్ మారిన తరువాత కేంద్ర బృందం వస్తోంది. ఎప్పటిలాగే పాడైపోయిన పంటలు క్షేత్రస్థాయిలో లేని సమయంలో 'పరిశీలన'కు వస్తోంది. ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందానికి జిల్లాలో పంట నష్టం వివరాలను తెలియజేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం మంగళవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంటుంది. ఒకటో బృందానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్ నేతృత్వం వహిస్తారు. ఇందులో సభ్యులుగా పొన్నుస్వామి, సునీల్ దూమే ఉన్నారు. రెండో బృందానికి ఖర్చుల విభాగం డైరెక్టర్ చిన్మయ్ గోట్‌మరే నేతృత్వం వహిస్తారు. ఈ బృందంలో సభ్యులుగా అశీష్‌పాండే, వినోద్‌కుమార్ ఉన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో రెండు బృందాల సభ్యులు ఈ నెల 19న సమావేశమౌతారు. ముందుగా 2023-24 రబీ సీజన్ పంటనష్టాన్ని తెలియజేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. సమావేశం ముగిసిన తర్వాత రెండో బృందం సభ్యులు కర్నూలు జిల్లాకు వెళతారు. ఒకటో బృందం సభ్యులు శ్రీసత్యసాయి జిల్లాలోని రొద్దం మండలంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళతారు. పర్యటన ముగించుకొని రాత్రికి అనంతపురం నగరానికి చేరుకుంటారు. ఈ నెల 20న పప్పుశనగ సాగు చేసిన విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్లు మండలాల్లో పర్యటిస్తారు. స్థానిక రైతులతో మాట్లాడి, పంటనష్టం వివరాలు తెలుసుకుంటారు.

రూ.36.86 కోట్ల పంటనష్టం

గత ఏడాది రబీ సీజన్‌లో 37,195 హెక్టార్లల్లో రూ.36.86 కోట్ల పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా 34,303 హెక్టార్లల్లో రూ.34.30 కోట్ల విలువైన పప్పుశనగ పంటనష్టం జరిగింది. మినుము 274 హెక్టార్లల్లో రూ.27.43 లక్షలు, పెసర 55.84 హెక్టార్లల్లో రూ.5.58 లక్షలు, ఉలవ 64.17 హెక్టార్లల్లో రూ.6.42 లక్షలు, జొన్న 2101 హెక్టార్లల్లో రూ.1.78 కోట్లు, నువ్వులు 46.38 హెక్టార్లల్లో రూ.3.94 లక్షలు, తెల్ల కుసుమ 49.39 హెక్టార్లల్లో రూ.4.20 లక్షలు, పొద్దుతిరుగుడు 296.94 హెక్టార్లల్లో రూ.29.69 లక్షల నష్టం వాటిల్లింది. మిగతా విస్తీర్ణంలో అలసంద, కొర్ర తదితర రకాల పంటలను రైతులు నష్టపోయారు.

ముందే రావాల్సింది..

గత ఏడాది రబీ సీజన్ ముగిసి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రబీలో దెబ్బతిన్న పంటల ఆనవాళ్లు క్షేత్రస్థాయిలో ఇప్పుడు కనిపించవు. పంటలు దెబ్బతిన్న సమయంలో కేంద్ర బృందాన్ని జిల్లాకు పంపించి ఉంటే వాస్తవ పరిస్థితులు వారికి కనిపించేవి. రబీ సీజన్ మార్చి నెలాఖరుతో ముగిసింది. రెండున్నర మాసాల తర్వాత కరువు బృందాన్ని పంపితే క్షేత్ర స్థాయిలో వారు దేన్ని పరిశీలిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. నష్టం జరిగిన ప్రతిసారీ ఇదే తంతు జరుగుతోంది. దెబ్బతిన్న పంటలను చూపించలేని పరిస్థితులలో ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.

కరువు మండలాలు 14..

గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. రబీ సీజన్‌లోనూ పంటలను తీవ్రంగా నష్టపోయారు. రబీలో పప్పుశనగతోపాటు ఇతర రకాల పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 14 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో బెళుగుప్ప, బొమ్మనహాళ, డి.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాలు ఉన్నాయి.


యల్లనూరులో పప్పుశనగ ఎండిపోవడంతో పశువులకు వదిలేసిన దృశ్యం (ఫైల్)


యాడికిలో ఎండిపోయిన మొక్కజొన్న (ఫైల్)

బీళ్లను సాగు భూములుగా మార్చడమే లక్ష్యం

● కలెక్టర్ వినోద్‌కుమార్



రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: బీడు భూములను సాగులోకి తీసుకురావడంతోనే ఎడారీకరణ-కరవు నివారణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ సమ్మిళిత దివ్యాంగుల పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ కరవు-ఎడారీకరణ నివారణ దినోత్సవం సందర్భంగా సదస్సు, ప్రదర్శనశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వర్షాభావ పరిస్థితుల్లో బీడుభూములను సాగులోకి తీసుకురావాలని, ఎడారీకరణ, కరవు సంకేతాలను తిప్పికొట్టేందుకు కనీసం పశుగ్రాసం సాగుచేయాలని రైతులకు సూచించారు. ఎడారీకరణ-కరవు నివారణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరపున సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో తక్కువగా లేదంటే తీవ్రంగా వర్షాలు కురుస్తూ వాతావరణంలో విపరీత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతుకు తమ పొలాల్లో సరిహద్దు మొక్కలుగా నాటేందుకు వంద మొక్కలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్లుగా జిల్లాలో ఎడారీకరణ-కరవు నివారణకు, నీటి సంరక్షణకు పనిచేస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ జేడీ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాకు సమస్యలు రానివ్వం: సీఈ



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న సీఈ, ఎస్ఈలు

బొమ్మనహాళ్, జూన్ 17: తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే సాగునీటిని ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందిస్తామని హెచ్చెల్సీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఈ రాజశేఖర్‌తో కలిసి ఎగువకాలువను పరిశీలించారు. 181 జీబీసీ ఉంతకల్లు వద్ద 112 కి.మీ. ప్రాంతంలో పడిన గండిని, 119 కి.మీ. చెర్లోపల్లి వద్ద కోతకు గురైన కాలువ గట్టు, యూటీ చానళ్లను పరిశీలించారు. అత్యవసర మరమ్మతుల కింద రూ.50 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సీఈ తెలిపారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 119 కి.మీ. వద్ద దెబ్బతిన్న యూటీ చానల్‌కు రూ.30 లక్షలు, 112 కి.మీ. వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు రూ.10 లక్షలు, 181 జీబీసీ వద్ద దెబ్బతిన్న పనులకు రూ.8 లక్షలు ప్రతిపాదించామని తెలిపారు. వీరితో పాటు ఈఈ రమణారెడ్డి, డీఈ మద్దిలేటి ఉన్నారు.

మంత్రిని కలిసిన యాదవ సంఘం నాయకులు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తాడిపత్రి టౌన్, జూన్ 17: తాడిపత్రి సరిహద్దులోని బొందలదిన్నె గ్రామ సమీపంలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను స్థానిక యాదవసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ అమరావతి నుంచి తాడిపత్రి మీదుగా ధర్మవరం వెళుతుండగా మండల సరిహద్దులో నాయకులు కలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో కడపజిల్లా బుక్కపట్నం పెద్దిరాజు యాదవ్, క్రిష్టయ్య, బొందలదిన్నెకు చెందిన నారాయణయాదవ్, సత్యనారాయణయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, సుబ్బరాయుడుయాదవ్, నాగశేఖర యాదవ్, లింగమయ్య యాదవ్ ఉన్నారు.

సంబరాల్లో దొంగలు పడ్డారు..!

● పోలీసుల అదుపులో నిందితుడు



జేబు కత్తిరించే సమయంలో కోతకు గురైన నోట్లు

పామిడి, జూన్ 17: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మొదటిసారిగా జిల్లాకు వస్తుండడంతో తెలుగు తమ్ముళ్ల స్వాగతం పలికేందుకు సోమవారం పెద్దఎత్తున పామిడి పట్టణానికి తరలివచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కచోట గుమికూడడంతో దొంగలు తమ చేతులకు పని పెట్టారు. బ్లేడ్‌తో గుంపులోని కొందరి కార్యకర్తల జేబులు కోసి డబ్బులు దొంగలించారు. మండలంలోని నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ డ్రాయర్ జేబు కత్తిరించడంలో తొడకు బ్లేడు కాటు పడింది. దీంతో ఆయన అప్రమత్తం కావడంతో అప్పటికే కొన్ని నోట్లు కట్ అయ్యాయి. కొందరు కార్యకర్తలు నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకుని పలువురు తమ జేబులను, డబ్బులను పరిశీలించుకోగా, మరో ఇద్దరు బాధితులు వెలుగులోకి వచ్చారు. పాళ్యం గ్రామానికి చెందిన ఆదినారాయణ రూ.8600, కండ్లపల్లి గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి రూ.20వేలు, నెమళ్లపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ రూ.20వేలు చోరీకి గురయ్యాయి. నిందితుడు పోలీసు స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాజు సిబ్బందితో తగిన చర్యలు తీసుకున్నారు.

ఆ.. మాట కోసం..!

● హంద్రీనీవా వెడల్పు ప్రకటనపై రైతుల ఆశలు

● టీడీపీ అధికారంలోకి రావడంతో అంచనాలు

● కాలువ పనులను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



లైనింగ్ పెండింగులో ఉన్న హంద్రీనీవా కాలువ

గుంతకల్లు, జూన్ 17: హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు మరలా ప్రారంభమౌతాయని రైతులు విశ్వసిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు గతంలో చిత్తశుద్ధితో పనిచేశారని, ఈసారి తప్పకుండా వైడెనింగ్ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం పాత కాంట్రాక్టులను రద్దుపరచడమేకాక, కొత్తగా ఎస్టిమేషన్లు, టెండర్లంటూ రెండేళ్లు మభ్యపెట్టి, చివరికి మొండి చేయి చూపింది. చంద్రబాబు ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ వైడెనింగ్ ప్రాజెక్టును ఆయనే పూర్తిచేసి వినియోగంలోకి తెస్తారని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జరగాల్సిన పనులివీ

హంద్రీనీవా వెడల్పు చేసే ప్రాజెక్టును 2017 ఏప్రిల్ 20న చంద్రబాబు నాయుడు ప్రతిపాదించారు. అందుకు సంబంధించిన పైలాన్‌ను పామిడిలో ఆవిష్కరించారు. తొంభై రోజుల కాల వ్యవధి లోపలే పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అయితే ఎస్టిమేషన్లు, టెండర్లు, అగ్రిమెంటు ప్రక్రియ కారణంగా రెండు నెలలు ఆలస్యం జరిగింది. మరో నెలకల్లా కాలువకు నీరు విడుదల కావడంతో పనులు ఆగిపోయాయి. నీరు నిలిచిన తర్వాత పనులు 2018లో పునఃప్రారంభం కాగా ఎన్నికల లోపు 60 శాతం అర్త్ వర్కులు పూర్తయ్యాయి. 40 శాతం మట్టిపనులు, మట్టికట్టల (బండ్) నిర్మాణ పనులు, వంతెనలు, స్లూయిజ్ చానళ్ల వద్ద కాలువలో వంద మీటర్ల మేర సిమెంటు లైనింగ్ పనులు జరగాల్సి ఉంది.

ఏటా 40 టీఎంసీల ప్రవాహమేదీ?

హంద్రీనీవా తొలి దశ పనులకు 10 టీఎంసీలు, మలి దశ పనులు పూర్తయితే గరిష్ఠంగా 40 టీఎంసీల నీరు పారేలా కాలువను డిజైన్ చేశారు. కాలువ బెడ్డింగ్ ప్రస్తుతం 10 మీటర్ల వెడల్పుతో ఉంది. కాలువ నిర్మాణం పూర్తయి 2013లో సాగునీటి పారుదల ప్రారంభమైన తర్వాత టీడీపీ హయాంలో 2018-19లో ఒకసారి, వైసీపీ హయాంలో 2020-21లో ఒకసారి మాత్రమే ఎత్తిపోతలు 40 టీఎంసీల మార్కును అందుకున్నాయి. టీడీపీ హయాంలో ప్రతి సంవత్సరం నీటి ఎత్తిపోతల రికార్డును పెంచుకుంటూపోగా, వైసీపీ హయాంలో 2020-21 తర్వాత ప్రతి సంవత్సరమూ నీటి ఎత్తిపోతలు తగ్గుతూ వచ్చాయి. గత సీజన్‌లో దాదాపు 22 టీఎంసీలను మాత్రమే ఇవ్వగలిగారు. కాలువ గరిష్ఠ సామర్థ్యం 40 టీఎంసీల నుంచి రెండింతలు చేయడానికి తొలిదశ కాలువ కింద ఉన్న 216 కి.మీ.ల కాలవను వెడల్పు చేయడానికి చంద్రబాబు సంకల్పించారు. తద్వారా తొలిదశ కాలువకు, జీడిపల్లి రిజర్వాయరు ఎగువన ఉన్న రెండో దశ కాలువకు ఒకేసారి సాగు, తాగునీరు అందించడానికి సాధ్యపడుతుంది. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల ఆ బృహత్కార్యం మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారడం వైడెనింగ్ పనుల పునఃప్రారంభంపై రైతులు ఆశలు పెంచుకున్నారు.

వైడెనింగ్ ప్రకటన కోసం ఎదురుచూపు

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రసంగం చేస్తారని, అందులో వివిధ పాలసీ విషయాలుగా ఆయన మాట్లాడుతారని, హంద్రీనీవా కాలువ వెడల్పుపై ఆయన తప్పక విధానాన్ని ప్రకటిస్తారని రైతులు ఎదురుచూశారు. కానీ ఎటువంటి ప్రసంగం చేయకపోవడంతో త్వరలో వైడెనింగ్ విషయంగా చంద్రబాబు ప్రభుత్వం తప్పక ప్రకటన చేస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు. త్వరలో హంద్రీనీవాకు సాగునీరు విడుదల అవుతున్న తరుణంగా కనీసం ఫిబ్రవరికల్లా వైడెనింగ్ కార్యక్రమంపై కార్యాచరణ జరిగితే ఎత్తిపోతలు ఆగిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయని, వచ్చే సీజన్‌కల్లా వైడెనింగ్ కల సాకారమౌతుందని భావిస్తున్నారు. వైడెనింగ్ పనుల కారణంగా హంద్రీనీవా కాలువలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టడంలేదు. దీనివల్ల కాలవలో నిర్మించిన మట్టికట్టలు శిథిలమౌతూ, కెనాల్‌లోకి జారిపోతున్నాయి. వైడెనింగ్ ప్రారంభమైతే కాలువ పటిష్టం అవుతుందని రైతులు చెబుతున్నారు.



మట్టికట్ట బలహీనపడిన హంద్రీనీవా కాలువ

కాలువ వెడల్పు పూర్తి చేయాలి



హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ప్రారంభించింది చంద్రబాబునాయుడే. ఇప్పుడు మళ్లా ఆయనే ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి వీలైనంత త్వరగా పూర్తి చేస్తారన్న నమ్మకం ఉంది. వచ్చే సీజనుకల్లా పనులు పూర్తి చేసి కాలవలో భారీ స్థాయిలో నీటిని పారించాలి.

- కందుల ప్రసాద రెడ్డి, కసాపురం రైతు

బాబుపై నమ్మకముంది



వైసీపీ హయాంలో కాలవ వెడల్పు పనులు చేయలేదు. కనీసం ఫిబ్రవరి ఆఖరు వరకూ కూడా నీరివ్వలేదు. మిర్చి రైతులకు నిరుడు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. కాలువ వెడల్పు పనులు పూర్తిచేయగలిగింది చంద్రబాబే. ఆయన హయాంలో పనులు తప్పక పూర్తవుతాయన్న నమ్మకముంది.

- బీ కొండప్ప, కసాపురం రైతు

కాలువ వెడల్పు పూర్తయ్యాక ఆయకట్టు ఇవ్వాలి



హంద్రీనీవా కింద గుంతకల్లు మండలానికి ఆయకట్టును ఇవ్వలేదు. వీలైనంత త్వరగా కాలువ వెడల్పు పనులు చేపట్టి పూర్తిచేయాలి. ఈ మండలానికి ఆయకట్టును స్థిరీకరించాలి. కసాపురానికి సమీపంలోనే కాలువ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కానీ మాకు ఆయకట్టును ఇవ్వలేదు. వెడల్పు తర్వాత ఎక్కువ నీరు వస్తుంది కనుక మాకు ఆయకట్టును ఇవ్వాలి.

- శేఖర్, కసాపురం రైతు

చంద్రబాబు పూర్తి చేస్తారు



చంద్రబాబు రైతులకు మేలు జరగాలని ఎంతో చిత్తశుద్ధితో హంద్రీనీవా కాలువ వెడల్పు చేపట్టారు. కానీ జగన్ ప్రభుత్వం కక్షగట్టి ఆ పనులను ఆపేసింది. చంద్రబాబు హంద్రీనీవాకు ముచ్చుమర్రి పంప్ హౌస్ నుంచి నీరిచ్చారు. వెడల్పు చేయడానికి రూపకల్పన చేశారు. రైతులకు మేలు చేయాలన్న ఆయన సంకల్పం అతి త్వరలో పూర్తవుతుందని భావిస్తున్నాం.

- భాస్కర్, కసాపురం రైతు

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయం

● కలెక్టర్ వినోద్‌కుమార్



యాత్రలో పాల్గొన్న ఆర్మీ, మాజీ సైనికులతో జిల్లా కలెక్టర్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 17: ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్-2024 ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆర్మీ ఆర్టిలరీ విభాగం డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ యాత్ర ఆదివారం అనంతపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో కలెక్టర్ వినోద్ కుమార్ అనంతపురం నుంచి జమ్మూకాశ్మీర్‌లోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకునే ఈ యాత్రను సోమవారం ఉదయం స్థానిక పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో జెండాను ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఎంతోమంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. కార్గిల్ విజయ్ దివస్ 26వ తేదీతో రజతోత్సవం జరుపుకుంటుందన్నారు. వీరులను స్మరించుకుంటూ దేశం నలుమూలల యువత, మాజీ సైనికులు, ప్రజల్లో దేశభక్తి, కార్గిల్ వీరుల స్ఫూర్తిని నింపడం కోసం ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ధనుష్కోడి, ద్వారకా, డింజెన్, ఢిల్లీ నుంచి కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్ డి-5 మోటర్ సైకిల్ యాత్ర ప్రారంభమైందన్నారు. ఈ నెల 26న జమ్మూకాశ్మీర్‌లోని ద్రాస్‌లో ఉన్న కార్గిల్ వార్ మెమోరియల్ చేరుకొని కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ మహోత్సవాలను ఇండియన్ ఆర్మీ జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, సార్జెంట్ సంజీవకుమార్, సుబేదార్ మహమ్మద్ ఇర్షాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టీకే కృష్ణ, మాజీ సైనికులు ఆర్ఎస్ నాగరాజు, తిమ్మారెడ్డి, పెంచలయ్య, వై. ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, అల్లాబక్ష్, సాయికుమార్, గిరీష్, బాబా ఫక్రుద్దీన్, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, కార్గిల్ మోటార్ సైకిల్ యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్దప్ప పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ యోజన సొమ్ము విడుదల

పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల వివరాలను కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షల మంది రైతులకు 106 కోట్లకు పైగా లబ్ధిచేకూరనుంది. అనంతపురం జిల్లాలో 2.76 లక్షల మంది రైతులకు 55.58 కోట్ల రూపాయలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులకు 50.44 కోట్ల రూపాయల లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ సొమ్మును కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేయనుంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (ఏప్రిల్-జులై 2024) 17వ వాయిదా కింద ఒక్కో రైతు ఖాతాలో రెండు వేల రూపాయలను కేంద్ర ప్రభుత్వం జమ చేయనుంది. తాజాగా విడుదల చేసే సొమ్ములో పీఎం కిసాన్ బకాయి మొత్తాలు కూడా కలిసి ఉంటాయి.

- అనంతపురం

బాలిక అనుమానాస్పద మృతి



ప్రమీల (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 17: మండలంలోని చౌడంపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టు వెంకటేష్ కుమార్తె ప్రమీల (16) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ వంశీకృష్ణ సోమవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడగొట్టు వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కాగా రెండో కుమార్తె ప్రమీల, ఆమె సోదరుడు ఆదివారం ఇంట్లో గొడవపడ్డారు. దీంతో తల్లిదండ్రులు ఆ బాలికను మందలించారు. దీంతో ఆమె అలిగి ఇంటి నుంచి బయటికెళ్లిపోయింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, స్నేహితురాళ్ల ఇళ్లల్లో గాలించారు. ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని చెక్ డ్యామ్ వద్ద బాలిక చెప్పులు కనిపించడంతో.. అనుమానం వచ్చి చెక్ డ్యామ్‌లో గాలించగా, ప్రమీల శవం లభ్యమైందన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మంత్రి సత్యకుమార్ ధర్మవరం రాక

● భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు

ధర్మవరం, జూన్ 17: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరానికి మంగళవారం రానున్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా నియోజకవర్గానికి రానుండటంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. తిరుమల దర్శనానంతరం సోమవారం రాత్రికి అనంతపురానికి చేరుకుంటారు. మంత్రితోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి వస్తుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి రోడ్డు మార్గాన బత్తలపల్లి మండలం యర్రాయపల్లి వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ఎత్తున వాహనాల ర్యాలీతో బత్తలపల్లి మీదుగా గొట్లూరుకు చేరుకుంటారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైక్ ర్యాలీతో ధర్మవరం పట్టణంలోకి అడుగుపెడతారు. కదిరిగేటు వద్ద చేనేత విగ్రహానికి పూలమాల వేసి దిమ్మెలసెంటర్ మీదుగా, తేరుబజారు నుంచి దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. అక్కడి నుంచి దుర్గానగర్ ఎదురుగా ఉన్న నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంత్రి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతారు. అక్కడి నుంచి కూటమి కార్యాలయానికి చేరుకుంటారు. ఇందు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలకు గొట్లూరు గ్రామానికి చేరుకుని సత్యకుమార్, పరిటాలశ్రీరామ్‌లకు స్వాగతం పలికి అక్కడి నుంచి ధర్మవరంలోని కూటమి కార్యాలయం వద్దకు చేరుకునే వరకు ర్యాలీ కొనసాగుతుందని శ్రేణులు పేర్కొన్నాయి. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు బైక్‌లలో వచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



ఎర్రిస్వామి (ఫైల్)

బెళుగుప్ప, జూన్ 17: మండలంలోని కాలువపల్లికి చెందిన యువరైతు ఎర్రిస్వామి(30) అప్పులబాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రిస్వామికి పది ఎకరాల పొలం ఉంది. అందులో మిరప, వేరుశనగ తదితర పంటలను సాగు చేసేవాడు. సాగునీటి కోసం పది బోరు బావులు తవ్వించగా ఒకదాంట్లో నీరు పడింది. ఆ బోరు కూడా ఇటీవల ఎండిపోయింది. దీంతో ఐదు ఎకరాల్లో సాగుచేసిన మిరప పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. దీనికితోడు గిట్టుబాటు ధర లభించలేదు. బోరు బావులు, పెట్టుబడి కోసం తెచ్చిన రూ.20 లక్షల అప్పు వడ్డీతో రూ.29 లక్షలకు చేరింది. వాటిని తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మిరప పంటకు తెచ్చిన పురుగు మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రైతు భార్య ప్రియాకం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 444 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పగలు ఎండ వేడి... రాత్రికి జడివాన..!

● తెగుళ్లతో అన్నదాతలు కుదేలు

● వర్షంతో పంటలకు సోకిన మచ్చతెగులు



తోటలోనే వదిలేసిన కర్బూజ పంట

కళ్యాణదుర్గం, జూన్ 17: ఉదయం ఎండ వేడి... రాత్రికి జడివానతో అన్నదాత కుదేలవుతున్నాడు. పంట ఎదుగుదల వచ్చే సమయంలో వర్ష ప్రభావంతో పంటలకు మచ్చతెగులు సోకి పంటను కాపాడుకోలేక పోతున్నారు. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. ఈ రబీలో కర్బూజ, కళింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో 800 ఎకరాలకుపైగా పంటలు సాగు చేశారు. ఎక్కువగా టమోటా, కర్బూజ వేశారు. కర్బూజ పంట కోత సమయంలో వారం రోజులు కురిసిన జడివానతో పంటంతా నాశనమైంది. వర్షం రాకముందు కర్బూజ టన్ను ధర రూ.30 వేలు ఉండేది. అదే వర్షం వచ్చిన తర్వాత టన్ను రూ.8 వేలకు పడిపోయింది. అసలు కాయలను కొనేవారు లేక తోటల్లోనే వదిలేశారు. ఈ కర్బూజ పంటనే 120 ఎకరాలకు పైగా నియోజకవర్గ వ్యాప్తంగా సాగు చేశారు. రూ.కోటికి పైగా నష్టపోయినట్లు తెలుస్తోంది. దాంతో పాటు టమోటాకు మచ్చతెగులు సోకి, కాసిన పూతంతా రాలిపోయింది. ఈ పూతను దక్కించుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో పాటు బీరకాయ పంటకు కూడా మచ్చతెగులు, ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి, ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో బూడిద తెగులు వచ్చి దిగుబడులపై ప్రభావం చూపింది. జడివానతో అన్నదాతలకు దడ పుట్టించి, ఆర్థికంగా నష్టానికి గురి చేసింది.



టమోటాకు ఎరుపు రంగులో ఉన్న తెగులు

కర్బూజ కాయలను తోటలోనే వదిలేశా



తనకున్న మూడు ఎకరాల పొలంలో కర్బూజ పంటను సాగు చేశా. కొనేందుకు వ్యాపారులు ఏ ఒక్కరూ రాకపోవడంతో తోటలనే పంటంతా వదిలేశా. వర్షం ధాటికి కొనేందుకు ఏ ఒక్కరూ రావడం లేదు. రూ. 2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. **- నాగార్జున, రైతు, కళ్యాణదుర్గం**

బీరపంటకు మచ్చతెగులు



తనకున్న మూడు ఎకరాల పొలంలో వర్షం ధాటికి బీర పంట అంతా మచ్చతెగులు సోకి నష్టపోయా. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ఆకుముడత, బూడిద, ఎరుపు రంగులోకి ఆకులన్నీ మారిపోయి పంటంతా పనికిరాకుండి పోయింది. **- లక్ష్మీరెడ్డి, రైతు, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు**

సంక్షిప్తంగా..



రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న హార్మోన్ సిటీ సీఎండీ రవికుమార్ నెట్టెం

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురం రూరల్, జూన్ 17: నగరంలోని పలుప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండబోదని విద్యుత్‌శాఖ డి-3 సెక్షన్ ఏఈఈ రామాంజినేయులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీనగర్ కాలనీ, సంఘమిత్రకాలనీ, ఆదర్శనగర్, బ్యాంక్ కాలనీ, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గార్లదిన్నె, జూన్ 17 : స్థానిక శింగనమల క్రాస్ సమీపంలోని సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో సోమవారం విద్యుదాఘాతంతో ప్రకాష్‌కుమార్ (25) మరణించాడు. బీహార్‌కు చెందిన ఇతనితో పాటు సంతోష్, గోవింద్, రామ్‌జీ, నిమలేష్ రెండు నెలలు నుంచి గార్లదిన్నెలోని బ్రిక్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. సోమవారం ప్రకాష్ కుమార్ సిమెంట్ ఇటుకలకు నీరు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రకాష్ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని నెమలి..

అనంతపురం క్రైం, జూన్ 17: స్థానిక హెచ్చెల్సీ కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని జాతీయ పక్షి నెమలి సోమవారం మరణించింది. త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు పరిశీలించి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారెప్పకు సమాచారం అందజేశారు.

టీడీపీ నాయకుడికి నివాళి

గార్లదిన్నె, జూన్ 17: మండలంలోని కోటంక గ్రామంలో టీడీపీ నాయకుడు సుబ్బన్న (75) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించాడు. ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి సుబ్బన్న మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి, నాయకులు గేటు క్రిష్టారెడ్డి, అనిల్‌కుమార్ చౌదరి, శ్రీరామ్‌రెడ్డి, మాజీ కన్వీనర్ జయరాం ఉన్నారు.

టీడీపీ కార్యకర్త గడ్డివామికి నిప్పు

రాప్తాడు, జూన్ 17: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, రైతు కె. భాస్కర్‌కు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అది దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున దాదాపు రెండు గంటల సమయంలో గడ్డివామికి నిప్పుపెట్టారు. భాస్కర్ మూడు గంటల సమయంలో గమనించగా అప్పటికే ఐదు ట్రాక్టర్ల వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపోయిన భాస్కర్‌కు టీడీపీ తరపున పుల్లలరేవు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందచేశాడు.

భారత సాఫ్ట్‌టెన్నిస్ జట్టుకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: జిల్లాకు చెందిన ఆరోన్ రోనాల్డినో భారత సాఫ్ట్‌టెన్నిస్ జట్టుకు ఎంపిక య్యాడు. ఈనెల 18 నుంచి 23 వరకు కొరియాలో నిర్వహించే నొంగ్యూప్ బ్యాంకు ఇంచియాన్ కొరియా అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో భారత జట్టుకు ఆరోన్ రోనాల్డినో ప్రాతినిథ్యం వహించనున్నాడు.



ఆరోన్ రోనాల్డినో

నేడు జిల్లా ఆస్పత్రికి కలెక్టరు

అనంతపురం టౌన్, జూన్ 17: జిల్లా సర్వజన ఆస్పత్రిని కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించనున్నారు. ఈ ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో ఆటిస్టిక్ ఫ్రైడ్ డే నిర్వహిస్తుండగా దివ్యాంగ పసి పిల్లల స్థితిగతులను పరిశీలించడానికి ఆయన ఆస్పత్రికి వస్తున్నారు. కాగా, జిల్లా ఆస్పత్రిలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా ఉందని ఆంధ్రజ్యోతి ఇటీవల అనేక కథనాలు ప్రచురించింది. దీంతో కలెక్టరు ఆ ఆస్పత్రిని పరిశీలిస్తున్నట్లు వైద్యవర్గాలు అంటున్నాయి. ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్యులు అప్రమత్తమై అవసరమైన తాత్కాలిక చర్యలు చేపట్టారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని... రికార్డులు పక్కాగా ఉండాలని... అందరు సమయానికి హాజరుకావాలని... అందరినీ అలర్ట్ చేసినట్లు సమాచారం.


అస్తవ్యస్తంగా వంతెన నిర్మాణం

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

అనంతపురం క్రైం, జూన్ 17: నగరంలోని అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అస్తవ్యస్తంగా చేపట్టారని, అశోక్‌నగర్ మొదటి క్రాస్‌కు ప్రజలు వెళ్లేందుకు దారి లేకుండా చేశారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను టీడీపీ నాయకుడు నారాయణస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. 2023 సెప్టెంబరులో కార్పొరేషన్ అధికారులు ఈ వంతెన నిర్మాణం చేపట్టారని, పబ్లిక్ హెల్త్‌లోని కొందరు ఇంజనీర్లు ఇరిగేషన్ అధికారుల సాయం తీసుకోకుండా దీన్ని నిర్మించారన్నారు. అస్తవ్యస్తంగా నిర్మించి.. అశోక్‌నగర్ మొదటి క్రాస్‌ను పూర్తిగా మూసివేశారన్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజలు మొదటి క్రాస్‌లో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

పాండురంగ స్వామి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్, జూన్ 17 : జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల మూల విరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.





రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలెక్టర్ వినోద్ కుమార్ ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో సోమవారం రాత్రి 10.15 గంటలకు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ వెంట జేసీ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జడ్పీ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఉన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

గార్లదిన్నె, జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటి సారిగా జిల్లాకు సోమవారం వచ్చిన పయ్యావుల కేశవ్‌కు ఘన స్వాగతం లభించింది. గార్లదిన్నె మండల కల్లూరు గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణి శ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్ కుమార్ చౌదరి, గేటు క్రిష్టారెడ్డి, ఆవుల క్రిష్ణయ్య, ఇల్లూరు రామాంజి, గుత్తా బాలకృష్ణ, వడ్డేవన్నూర్, వెంకటేసు, సుబ్బయ్య, ఆవుల శీనా, సుబ్బు, వెంకట్రామిరెడ్డి, బాబయ్య, ఎర్రిస్వామి, నరసింహారెడ్డి, రాము, సుంకన్న, సామాల మధు, రాయుడు, రామాంజి, నాగేంద్ర పాల్గొన్నారు.



కల్లూరులో మంత్రికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ఈద్గాలో నీటి సమస్య పరిష్కారం

హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



నీటి పంపిణీని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 17: మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్లకాలనీలోని ఈద్గాలో బోరు వేయించి, నీటి సమస్యను పరిష్కరించి.. ఇచ్చిన హామీని నిలుపుకున్నారు ఎమ్మెల్యే పరిటాల సునీత. ఎన్నికల ప్రచార సమయంలో స్థానిక టీడీపీ నాయకులు ఈద్గాలో బోరు వేయించాలని పరిటాల సునీతను విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తామని నాడు హామీ ఇచ్చారు. అందులో భాగంగా పార్టీ అధికారంలోకి రాగానే ఈద్గాలో రూ.2.50 లక్షలతో బోరు వేయించారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు నెట్‌కాన్ చంద్రశేఖర్, గుర్రం మనోహర్‌నాయుడు, ఇతర నాయకులు బోరుకు మోటార్ బిగ్గించి నీటి సరఫరాను ప్రారంభించారు. సందర్భంగా ముస్లింలు టీడీపీ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్, లక్ష్మినారాయణ, ఈడిగ సూరి, రాము పాల్గొన్నారు.

జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: స్థానిక ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా ఆర్చరీ ఎంపిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, శివకుమార్ తెలిపారు. అండర్-10, 13, 15 బాల, బాలికల క్యాటగిరీలలో మొత్తం 36 మంది ఎంపికయ్యారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల చైర్మన్ చిరంజీవిరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ అరుణ్‌కుమార్ రెడ్డి ఈ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కోశాధికారి రవికుమార్, కోచ్‌లు నళిని, రాహుల్, లక్ష్మీదేవి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా ఆర్చరీ జట్టు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు, బహుమతులతో విద్యార్థులు

అనంతపురం విద్య/ కల్చరల్, జూన్ 17: నగరంలోని ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీస్ మెమోరియల్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్కియాలజీ డిపార్టుమెంట్ ఏడీ రజిత, సీఐ జాకీర్ హుస్సేన్ మాట్లాడారు. ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఎంతగానో పిల్లల్లో కళలపై అభిరుచిని పెంపొందిస్తోందన్నారు. ముఖ్యంగా చిత్రకళ, డ్యాన్స్, యోగా, పెయింటింగ్ తదితర అంశాల్లో పిల్లలను తీర్చిదిద్దుతోందన్నారు. ఫైన్ ఆర్ట్స్ టీచర్ వినోద్‌కుమార్ పిల్లలను కళల వైపు ప్రోత్సహిస్తున్నా రన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంగీతం టీచర్లు అజయ్, డ్యాన్స్ మాస్టర్ భార్గవ్, శ్రీనివాసులు కర్మిషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

ప్రమాదకరంగా గుంత, కుంగిన కల్వర్టు

చెన్నేకొత్తపల్లి, జూన్ 17: ధర్మవరం నుంచి ఎన్ఎస్‌గేటు వెళ్లే ప్రధాన రహదారి చందమూరు సమీపంలో ప్రమాదకరంగా ఉంది. నడిరోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. ప్రస్తుతం ఆ గుంత పక్కనే రోడ్డుకు సంబంధించిన కల్వర్టు కుంగిపోయింది. వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటు వహిస్తే ప్రమాదానికి గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంత పక్కన్నే కల్వర్టు కుంగిపోయింది. రాత్రి సమయాల్లో వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం చోటు చేసుకునే ప్రమాదం ఉంది. మూడు రోజుల క్రితం ప్రయాణీకులతో వెళ్తున్న ఓ ఆటో బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. కుంగిన కల్వర్టు పక్కన కొందరు రాళ్లు ఉంచి ఎండిన కొమ్మపై పాత దుస్తులతో ప్రమాద హెచ్చరికలాగా ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణంతో పాటు గుంతకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.





ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటు రోడ్డులో చందమూరి సమీపాన కుంగిన కల్వర్టు

రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంత

అంగన్‌వాడీ కేంద్రం పక్కనే గుంత



రాప్తాడు, జూన్ 17: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీలోని చిన్మయ్‌నగర్-1వ అంగన్‌వాడీ కేంద్రం పక్కన గుంత ప్రమాదకరంగా ఉంది. ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం స్థానికులు పెద్ద గుంత తవ్వి.. దాన్ని పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండటంతో గుంతలోకి వర్షపు నీరు ఎక్కువగా చేరాయి. రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి దాదాపు 15 మంది చిన్నారులు వస్తుంటారు. వారు ప్రమాదవశాత్తు జారిపడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఆ నీటి వల్ల భవనమూ దెబ్బతిని కూలే ప్రమాదముందన్నారు. కావున ఆ గుంతను వెంటనే పూడ్చివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అనంతపురంలో కేఎం షఫీవుల్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సైపుద్దీన్



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న గౌస్‌మొద్దీన్, రియాజుద్దీన్



మతపెద్దకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ఊరూవాడా అంతటా బక్రీద్ పండుగను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతపురంలోని డ్రైవర్స్ కాలనీలోని ఈద్గా మైదానం వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, రామ్‌నగర్ మసీదులో ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేయం షకిల్‌షఫి, ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందులో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనల్లో ప్రీస్ట్ అబ్దుల్ మాజిద్ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతపురంలోని షాహి ఈద్గా మైదానం వద్ద మానవత రక్తదాతల సంస్థ కో-కన్వీనర్ సలీమ్ మాలిక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 81 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతోపాటు శిబిరంలోనే సామూహిక ప్రార్థనలు చేశారు. ఇందులో మానవత రక్తదాతల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల అమరనాథరెడ్డి, టీడీపీ నాయకుడు డిస్కోబాబు, ప్రభుత్వ వైద్యకళాశాల బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అనంతపురంరూరల్, శింగనమల, నార్పల, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లోనూ ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.







కక్కలపల్లి కాలనీ, సీకేపల్లి, రాప్తాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పయ్యావుల కేశవ్‌కు నెట్టెం బాలకృష్ణ శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, జూన్ 17 : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు టీడీపీ నాయకులు నెట్టెం బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కర్నూలులో పయ్యావుల కేశవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.



మంత్రికి స్వాగతం పలికిన టీడీపీ నేతలు



మంత్రి పయ్యావుల కేశవ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

బుక్కరాయసముద్రం, జూన్ 17: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు శింగనమల నియోజకవర్గం టీడీపీ నేతలు ఘనంగా స్వాగ తం పలికారు. అందులో ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ నేత పసుపుల శ్రీరామరెడ్డి తదితర నేతలు ఉన్నారు. గుత్తి వద్ద బాటలో సుంకమ్మ దేవాలయానికి నియోజకవర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లి మంత్రికి అభినందనలు తెలిపారు. రామలింగారెడ్డి అధ్వర్యంలో మండలం నుంచి పలు వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

పయ్యావుల ఆర్థిక శాఖకే వన్నెతెస్తారు : ఎమ్మెల్యే దగ్గుపాటి



మంత్రి కేశవ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 17: పయ్యావుల కేశవ్ ఆర్థిక శాఖకే వన్నెతెస్తారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తపోవనం సర్కిల్ వద్ద రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... టీడీపీ విజయం సాధించగానే పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ కేటాయిస్తారని ఊహించానని, అది నిజమైందని అన్నారు. పయ్యావుల కేశవ్ తెలివితేటలు, వాక్ చాతుర్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఆయన అసెంబ్లీలో మైక్ పట్టుకుంటే వైసీపీ నాయకుల్లో వణుకు పుట్టేదన్నారు. ఆర్థిక శాఖను సక్రమంగా నిర్వహించగలిగే శక్తిసామర్థ్యాలు కేశవ్‌కే ఉన్నాయన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, జూన్ 17: ఎస్కేయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ డెవలప్‌మెంట్ ట్రైనీ సెంటర్ (స్కియాడ్)ను పునఃప్రారంభించి పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్కియాడ్ వద్ద నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ విద్యార్థులు పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు స్కియాడ్ ఏర్పాటు చేశారన్నారు. ఎస్కేయూ యాజమాన్యం ఈ కేంద్రానికి ప్రత్యేక డైరెక్టర్‌ను నియమించి శిక్షణ ఇచ్చేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం చేయడంతో విద్యార్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, తిమ్మప్ప, ఓబిలేసు, ఈశ్వరయ్య, నారాయణస్వామి, విద్యార్థులు శివ, రాజశేఖర్, కుమార్, నరేష్, గోపాల్ పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..



ఆర్టీఓ కార్యాలయం ప్రధాన రోడ్డులో వేసిన చెత్త

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: నివాసాల మధ్య, రోడ్లపై పడేసిన చెత్తను తొలగించి తమ ఆరోగ్యం కాపాడాలని హౌసింగ్ బోర్డు, నవోదయకాలనీ, హమాలీకాలనీ వాసులు కోరుతున్నారు. పదిరోజులుగా వీధుల్లో చెత్తను తొలగించలేదని, దీనిపై వార్డు సచివాలయం, నగరపాలక సంస్థ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. చెత్త, మురుగు నిల్వ ఉండటంతో పందులు అధికంగా సంచరిస్తున్నాయని, దోమలు, ఈగలు అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రజాప్రతినిధులు స్పందించి.. ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న ముస్లింలు

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా

● ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జూన్ 17: నిద్ర మాని అయినా ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంత్రి హోదాలో మొదటిసారి నియోజకవర్గానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆయనకు ఘనస్వాగతం పలికారు. బైపాస్ సర్కిల్ నుంచి క్లాక్‌టవర్ కూడలి వరకూ అశేషజనసంద్రం మధ్య విజయోత్సవ ర్యాలీ ముందుకు కదిలింది. జాతీయ రహదారి వెంబడి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మంత్రి కేశవ్‌కు బ్రహ్మరథం పట్టారు. అనంతరం క్లాక్‌టవర్ కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తన పట్ల ప్రజలు చూపిన ఆదరాభిమానాలను మరువలేనన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. 30ఏళ్లుగా తనను గుండెల్లో పెట్టుకుని చూసుకున్న ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వనన్నారు. తనకు మంత్రి పిలుపు కొత్తగా ఉందన్నారు. మీరు ఎప్పటి లాగే కేశవన్న అని పిలవాలని ప్రజలను కోరారు. సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 30ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు చూశానన్నారు. మీ అభిమానం ముందు అవన్నీ తుడుచుపెట్టుపోయాయన్నారు. అసెంబ్లీలో ఉరవకొండ అంటే గుర్తింపు వచ్చేలా నియోజకవర్గ ప్రజలు చేశారని, మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మెన్లు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, మండల కన్వీనర్లు నూతేటి వెంకటేశులు, టీడీ మారయ్య, వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు, నాయకులు భీమలింగ, ప్యారం కేశావనంద, నర్రాకేశన్న, అల్లాబకాష్, యర్రగుంట్ల వెంకటేశులు, రహంతుల్లా, పాల్గొన్నారు.

11గంటల పాటు సాగిన విజయోత్సవ ర్యాలీ

జిల్లా సరిహద్దు గుత్తి మండలం బాట సుంకులమ్మ వద్ద ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ 11గంటల పాటు అశేష జనసంద్రం నడుమ సాగింది.


విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉదయం 10:30కి బాట సుంకులమ్మ వద్ద ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ రాత్రి 9గంటలకు ఉరవకొండకు చేరుకుంది. గుత్తి, పామిడి, గార్లదిన్నె, అనంతపురం, కూడేరు, మీదుగా ఉరవకొండ వరకూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. భారీ గజమాలలతో సత్కరించారు. ఉరవకొండ కవితా హోటల్ కూడలిలో బహిరంగసభతో ర్యాలీ ముగిసింది. అనంతరం స్వగ్రామమైన కౌకుంట్లకు మంత్రి కేశవ్ వెళ్లారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా: మంత్రి కేశవ్

పామిడి, జూన్ 17: కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు సోమవారం పామిడిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత ఆయన ఎద్దులపల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం తెలుగు తమ్ముళ్లకు అభివాదం చేశారు. తర్వాత బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ పామిడి మండలం ఉరవకొండ నియోజకవర్గంలో ఉన్నప్పుడు మీలో ఒకడిగా భావించి ఎమ్మెల్యేగా గెలిపించారని, ప్రస్తుతం ఈ మండలం గుంతకల్లు నియోజకవర్గంలో ఉన్నా తనను ఇక్కడి ఎమ్మెల్యేగా కూడా ప్రజలంతా భావించవచ్చన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా అనంతపురం జిల్లాకు కూలీనేనన్నారు. గతంలో నీటి కోసం ఎన్నో ప్రయత్నాలు, పోరాటాలు చేశామన్నారు. చంద్రబాబునాయుడు హయాంలోనే హంద్రీనీవా తెచ్చుకున్నామన్నారు. రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ఎంతో అవసరమని భావించి ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలను ఎన్డీయే కూటమికి అందజేశారన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మీకాంతమ్మ, మాజీ ఎంపీటీసీలు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, రమేష్‌నాయక్, నార్త్ కెనాల్ ఎద్దులపల్లి డిస్ట్రిబ్యూటరీ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు రంగస్వామియాదవ్, పత్రా శ్రీనివాసులు, సునీల్, ప్రతాప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజల కష్టాలు తీర్చడానికే మంత్రిగా అవకాశం

గుత్తి/గుత్తిరూరల్,జూన్17: జిల్లా ప్రజల కష్టాలను తీర్చడానికే భగవంతుడు తనకు మంత్రిగా అవకాశం కల్పించినట్లు భావిస్తున్నానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు గుత్తి శివారులోని బాటసుంకలమ్మ ఆలయం వద్ద టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు సోమవారం ఘనస్వాగతం పలికారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కేశవ్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహాలకు పయ్యావుల కేశవ్, గుమ్మనూరు జయరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి గాంధీ సర్కిల్ వరకు టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి మంత్రి కేశవ్ పూమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గం అయిన ఉరవకొండకు అనుకొని గుంతకల్లు నియోజకవర్గం ఉందన్నారు. ఈ నియోజకవర్గంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అంతకుముందు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ వైసీపీ పాలనలో గుంతకల్లు నియోజకవర్గానికి అన్యాయం జరిగిందన్నారు. గుత్తి పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీటి సమస్యకు నిధులు మంజూరు చేసి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంత్రి పయ్యావుల కేశవ్ కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు మాట్లాడుతూ ఉరవకొండ ప్రాంతం నుంచి సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పయ్యావుల కేశవ్‌కు మంత్రి పదవి లభించడం ఉమ్మడి అనంతపురం జిల్లాకు వరమన్నారు. గాంధీ సర్కిల్‌లో టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో కేశవ్‌కు భారీ గజమాలను వేశారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, మడకశిర, కల్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి, జేసీ అస్మిత్ రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, ముట్టిమడుగు కేశవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బండారు ఆనంద్, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కృష్ణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ నాయకులు సోమశేఖర్, సర్పంచు భరత్‌కుమార్, నాయకులు నారాయణస్వామి, ఎంకే చౌదరి, గుత్తి టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ, జిల్లా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


గుత్తి గాంధీసర్కిల్‌లో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

దుర్గం నుంచి భారీగా తరలిన టీడీపీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం, జూన్ 17: మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కేంద్రానికి రావడంతో నియోజకవర్గంలోని ఐదు మండలా ల నుంచి 200 వాహనాలలో టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. సోమవారం ప్రజావేదిక వద్ద నుంచి భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు. మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమైక్య నినాదంతో ముందుకు సాగుదామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కూలీలా పనిచేస్తా

కూడేరు, జూన్ 17: ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి మొదటి కూలీలాగా పని చేస్తానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంత్రి హోదాలో తొలిసారిగా సోమవారం ఆయన ఉరవకొండ నియోజకవర్గానికి వచ్చారు. ఆయనకు టీడీపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం నుంచి కూడేరుకు రావడంతో పార్టీ శ్రేణులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గొట్కూరు, కమ్మూరు, అరవకూరు, కూడేరు, ముద్దలాపురం, జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట తదితర గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు గ్రామాల్లో మంత్రి పయ్యావుల కేశవ్‌ను గజమాలలు, శాలువాలతో సత్కరించారు.


కూడేరులో మంత్రి కేశవ్‌కి ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు


కమ్మూరులో పూలమాలలతో మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మటన్ డబ్బుల కోసం ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్, జూన్ 17: మండలంలోని రజాపురం గ్రామంలో సోమవారం మటన్ డబ్బుల కోసం జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన రాంగోపాల్ నాయుడు మటన్ డబ్బులు ఇవ్వాలని యువరాజును అడిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దిగారు. క్రిష్ణమనాయుడు, యువరాజు, రంగ, ధనలక్ష్మి మరో వర్గం రాంగోపాల్ నాయుడు, దినేష్, సర్వస్వతి కర్రలతో దాడి చేసుకోవడంతో ఈ దాడిలో రాంగోపాల్ నాయుడుకి, క్రిష్ణమనాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం రూరల్, జూన్ 17: డీ.హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో ఆదివారం జరిగిన హత్యకేసులో నిందితుడని అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మురడి గ్రామానికి మురడప్ప (50) వాటర్‌ట్యాంక్ వద్ద చికెన్ వండుతుండగా అదే గ్రామానికి చెందిన హరిజన చిన్నబాబు అలియాస్ ఏసురాజు తనకు చికెన్ పెట్టమని, మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. మురడప్ప ఇవ్వకపోవడంతో బండరాయితో తలకు బలంగా కొట్టాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. ఈ విషయంపై నిందితుడైన యేసురాజును సోమవారం సాయంత్రం 5 గంటలకు కల్యం బస్టాండ్‌లో అరెస్టు చేసినట్లు తెలిపారు. పిన్నతల్లి హరిజన వన్నక్క ఫిర్యాదు మేరకు డీ.హీరేహాళ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసును ఛేధించడంలో కృషి చేసిన రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, డీ.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మహిళపై భర్త, అత్త దాడి

గుంతకల్లు టౌన్, జూన్17: పట్టణంలోని పాతగుంతకల్లులో నివాసముంటున్న తనపై భర్త బ్రహ్మయ్య, అత్త పార్వతి, బంధువులు సోమవారం దాడి చేశారని బాధితురాలు లక్ష్మి తెలిపింది. తనకు ఆర్ఎంపీ బ్రహ్మయ్యతో 2008లో వివాహం అయ్యిందన్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానమన్నారు. వివాహం అయినప్పటి నుంచి భర్తతో గొడవలు జరుగుతున్నాయన్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయన్నారు. ఐదేళ్ల నుంచి తన పిల్లలతో పాతగుంతకల్లులో వేరుగా నివాసముంటున్నట్లు ఆమె తెలిపారు. తమ విడాకుల కేసు కోర్టులో నడుస్తోందన్నారు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం తన భర్త బ్రహ్మయ్య, అత్త పార్వతి, వారి బంధువులు రామాంజనేయులు, మోహన్, రంగమ్మలు రోకలిబండ, కారం తీసుకుని ఇంటి మీద దాడికి వచ్చారన్నారు. ఇంట్లోకి చొరబడి తనను, తన కుమార్తెను కొట్టారని తెలిపారు. 100 కాల్ చేయడంతో టూటౌన్ పోలీసులు సకాలంలో రావడంతో తన ప్రాణాలు నిలిచాయన్నారు. దాడి చేసిన వారిని టూటౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడి ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ గణేష్ తెలిపారు.


పిల్లలతో బాధితురాలు లక్ష్మి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్, జూన్ 17: మండలంలోని డీ.కొండాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో అంజనేయులు(48) సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు ఆంజనేయులు వ్యవసాయ కూలి పని చేస్తూ, ప్రతి ఆదివారం చికెన్‌కొట్టును నడుపుతూ జీవించేవాడు. ఆదివారం ఉదయం తనకున్న ఐదు గొర్రె పిల్లలకు పచ్చిగడ్డి తీసుకువస్తానని చెప్పి ఒక రైతు పొలంలోకి వెళ్లాడు. అక్కడ గడ్డి కోస్తుండగా కింద పడిన విద్యుత్ వైర్లు చేతికి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. కూలి పనులకు వెళ్లిన భార్య సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి భర్త కోసం వెతికింది. కనిపించకపోవడంతో స్థానికుల సహాయంతో చుట్టుపట్ల గాలించింది. చివరకు రాత్రి ఏడు గంటల సమయంలో రైతు తోటకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ఆంజనేయులు (ఫైల్)

ఆలయ అభివృద్ధికి కృషి

పామిడి, జూన్ 17: పట్టణంలోని భోగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. స్థానిక భోగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలోని పెన్నానది ఒడ్డున ధోబీఘాట్‌లో సోమవారం సాయంత్రం రజకులు గుమ్మనూరు ఈశ్వర్‌ను సత్కరించారు. ఎన్నికల సందర్భంగా ఉతికిన బట్టలు ఆరబెట్టుకునేందుకు షెడ్డు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే నెమళ్లపల్లి గ్రామం వద్ద సోమవారం సాయంత్రం కంపచెట్లు తొలగించేందుకు భూమిపూజ నిర్వహించారు. త్వరలోనే అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా గల కంపచెట్లను తొలగిస్తామన్నారు.

డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

తాడిపత్రిటౌన్, జూన్17: పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ గౌతమిశాలి సోమవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీని ఆదేశించారు. పట్టణంలో శాంతిభద్రతలపై ఆరాతీశారు. సరిహద్దుల్లో, నాయకుల ఇళ్లవద్ద ఏర్పాటు చేసిన పికెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. టీడీపీ కార్యకర్త లాల్‌బాషా హత్య గురించి ఆరాతీశారు. ఆమె వెంట డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఉన్నారు.

మంత్రికి సత్కారం

ఉరవకొండ,జూన్17: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి విచ్చేసిన పయ్యావుల కేశవ్‌ను సంచార జాతుల మొండి బండ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ మారెన్న సోమవారం సత్కరించారు. విజయోత్సవర్యాలీలో భాగంగా కూడేరులో మంత్రిని కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, రాజు ఉన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న మారెన్న

దోపిడీకి తెర !

● గొర్రెల సంతపై వైసీపీ నాయకుల అక్రమ దందాకు చెక్
● అధికారుల చొరవతో మార్కెట్‌యార్డులో సంత నిర్వహణ


మార్కెట్‌యార్డులో గొర్రెల సంత


సంత స్థలం మార్పుతో ఖాళీగా ఉన్న వైసీపీ నాయకుల స్థలం

యాడికి, జూన్17: మండలకేంద్రంలో ప్రతి వారం నిర్వహించే గొర్రెల సంతలో అక్రమ దందాకు మార్కెట్‌యార్డు అధికారులు సోమవారం చెక్ పెట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి చొరవతో సంతను వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించేవారు. మొదట సంతలో క్రయ, విక్రయాలు ఉచితంగా నిర్వహించుకొనేవారు. తర్వాత మార్కెట్‌యార్డు నిర్వహణ కోసం అధికారులు ఒక్కొక్క గొర్రెపై నామమాత్రపు రుసుం రూ.5 వసూలు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు కొత్తరకం దందాకు తెరలేపారు. గత ఎనిమిది నెలలుగా యాడికిలో గొర్రెల సంత నిర్వహణను వైసీపీ నాయకులు వారికి సంబంధించిన స్థలంలో నిర్వహించుకుంటూ అక్రమ వసూళ్లు చేసేవారు. గొర్రెల సంతలో క్రయ, విక్రయాలకు వచ్చే గొర్రెలపై ఒక్కొక్క దానికి రూ.30నుంచి రూ.50 వరకు వసూలు చేసేవారు. ప్రతి సోమవారం ఐదు వేల నుంచి ఏడు వేల దాకా గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు విక్రయాలకు వచ్చేవి. ఈ లెక్కన ప్రతి సోమవారం వైసీపీ నాయకులు రూ.2లక్షల వరకు జేబులు నింపుకొనే వారని స్థానికులు తెలిపారు. దీనిపై అప్పట్లో అభ్యంతరాలు వచ్చినా, మార్కెట్‌యార్డు అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నాయకులను ఏమి చేయలేకపోయారు. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుల స్థలంలో గొర్రెల సంత నిర్వహణ, అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సోమవారం మార్కెట్‌యార్డు సెక్రటరీ ఆనంద ఆదేశాలతో సిబ్బంది యాడికికి వచ్చి గొర్రెల సంతను వైసీపీ నాయకుల స్థలంలో నుంచి మార్కెట్‌యార్డుకు తరలించారు. సోమవారం ఉచితంగానే క్రయవిక్రయాలు జరిగాయి. దీనిపై సంతకు వచ్చిన గొర్రెల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. దోపిడీకి తెరపడిందని తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి: ఎమ్మెల్యే


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, జూన్ 17: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని రెడ్ డ్రాప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెహమాన్ ఆధ్వర్యంలో సోమవారం ఈద్గా ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్ పీర్ ఖాదీర్ ప్రారంభించారు. పలువురు రక్తదానం చేశారు. వీరికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పండగ సందర్భంగా ఈద్గా మైదానాలు, దర్గా మైదానాల్లో ఉదయమే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీలు బక్రీద్ సందేశాన్ని వినిపించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు. నమాజు అనంతరం ముస్లింలు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్లలో పొట్టేళ్లను ఖుర్బానీ ఇచ్చారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


బొమ్మనహాళ్: గోవిందవాడ ఈద్గా మైదానంలో ప్రసంగిస్తున్న ముతవల్లి


గుంతకల్లులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి


ఉరవకొండ: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


విడపనకల్లు: ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


కణేకల్లు: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రాయదుర్గంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గుత్తి ఆర్ఎస్‌లో ప్రార్థనలు చేస్తున్న మత గురువు


తాడిపత్రి టౌన్: కొత్త ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


డి.హీరేహాళ్: ఈద్గా మైదానంలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


బ్రహ్మసముద్రం: బక్రీద్ పండుగను నిర్వహించుకుంటున్న ముస్లింలు


కంబదూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు